క్లుప్తంగా

ఈ-పంట నమోదుతో ప్రయోజనం

మద్దికెర : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈనెల 15వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి రవి ఆదివారం తెలిపారు. ఇప్పటి వరకు 95 శాతం నమోదు పూర్తయ్యిందన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలని చెప్పారు. పంట నమోదు చేయంచుకోవడం వల్ల ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని హైవే 44పై అమేజాన్ కిచెన్స్ ఎదురుగా శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి తమిళనాడు వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ రాజేశ్, క్లీనర్ మనోజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హైవేపై ఉన్న గుంతల మూలంగా తమ లారీ ఒకవైపునకు ఒరిగిపోయి అదుపు తప్పి కింద పడిందని బాధితులు తెలిపారు. హైవే పోలీసులు లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మాళ మల్లేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో మూలమూర్తులకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, ఆకుల అలంకరణ, ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామి వారిని దర్శించుకోవడానికి ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

హొళగుంద: మద్దిలింగదహళ్లి గ్రామంలో ఆదివారం సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదోని గోపి చారిటబుల్ బ్లడ్ బ్యాంక్ వారు రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మొత్తం 33 మంది రక్తదానం చేశారు.

రోడ్డుకు మరమ్మతులు



తుగ్గలి రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డుపై పడిన గుంతలకు మట్టి తోలిస్తున్న ఎస్ఐ

తుగ్గలి : స్థానిక రైల్వే బ్రిడ్జి వద్ద ప్రధాన రోడ్డుపై పడిన గుంతలను ఎస్ఐ కృష్ణమూర్తి ప్రత్యేక చొరవ తీసుకుని మట్టితో పూడ్చి వేయించారు. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు పడి నెలల తరబడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రైల్వే అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. ఎస్ఐ స్పందించి మట్టి వేయించి గుంతలు పూడ్పించి రాకపోకలు సాఫీగా సాగేలా చేశారు.

రోడ్డు సమస్య పరిష్కారం

హొళగుంద: స్థానిక వారపు సంత మార్కెట్ వెనుక చాలా కాలంగ సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న బీసీ కాలనీ వాసుల సమస్య తీరనుంది. ఆదివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. బస్టాండ్ నుంచి రూ.5 లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు కోగిలతోట శేషప్ప, మండల కన్వీనర్ షఫీవుల్లా, హనుమప్ప తెలిపారు. అలాగే మరో రూ.5 లక్షల జెడ్పీ గ్రాంట్‌తో కోగిలతోటలో ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌కు ప్రహరీ నిర్మించనట్లు కోగిలతోట శేషప్ప చెప్పారు.

హిందూ ధర్మంపై ప్రచారం

కృష్ణగిరి: శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టత, హిందూ ధర్మంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి డోన్ అధ్యక్షుడు నాగార్జున పిలుపునిచ్చారు. ఆదివారం సమితి సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని గుడెంపాడు గ్రామంలో జన్మాష్టమి విశిష్టత, హిందూ ధర్మంపై ప్రచారం చేశారు. వెంకటేశ్వర్లు, శివకుమార్, గిరి, జానీ, శివాజీ, బాబు, శ్రీరాములు, శశికళ, భాగ్యాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన తేజ

చిప్పగిరి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నగరడోణ గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..మండల కేంద్రానికి చెందిన జి.ఎస్. లక్ష్మీనారాయణ, లలితమ్మ కుమారుడు జీఎస్. తేజ ఆలూరు వైపు నుంచి స్వగ్రామానికి రాత్రి 8.30 గంటల సమయంలో బైక్‌పై వస్తున్నాడు. నగరడోణ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. గుర్తించిన స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో గుంతకల్లు ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.



హొళగుంద దేవమ్మ ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



కోయినగర్ కాలనీలో 12 అడుగుల విఘ్నేశ్వరుడు



ఆలూరులోని కోయినగర్‌లో కొలువైన గణనాథుడు



ఆలూరు మారుతీ నగర్‌లో కొలువైన గణపయ్య



ఆలూరు మెయిన్ బజార్‌లో కొలువుదీరిన గణనాథుడు

మహాకాలాయ.. మహాబలాయ

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు
- వాడవాడలా కొలువుదీరిన గణపతి విగ్రహాలు
- వివిధ రూపాల్లో ఆకట్టుకున్న ప్రతిమలు



చిప్పగిరిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి



పత్తికొండలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఆలూరు: వినాయక చవితి ఉత్సవాలను నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. వాడవాడలా విఘ్ననాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేసి ఘనంగా పూజలు చేశారు. పట్టణంలోని పలు కాలనీల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో స్థానికులు పూజలు చేసి గణపతికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలూరు సీఐ కె.శ్రీనివాసనాయక్ నేతృత్వంలో ఎస్ఐ సి. వెంకట నరసింహులు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేడు నిమజ్జనం..

చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను సోమవారం భక్త మండలి సభ్యులు నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు అనుమతి పొందిన విగ్రహాలను హాలహర్వి మండలం బాపురం గ్రామం వద్ద ప్రవహిస్తున్న ఎల్లెల్సీకి తరలించేందుకు భక్త మండలి సభ్యులు ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్ఐ సి.వెంకటనరసింహులు తెలిపారు.

ఆలూరు రూరల్: వినాయక చవితిని పండగ సందర్భంగా శనివారం వాడవాడలో గణనాథులు కొలువయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో యువత వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో మహిళలు ప్రత్యేక వంటలు తయారు చేసి వినాయకుడికి నైద్యం సమర్పించారు. ఆలూరులోని కోయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద అన్నదానం చేశారు. మండలంలోని మొలగవల్లి,పెద్దహోతూరు, అరికెర,హత్తిబెళగల్, కమ్మరచేడు,హులేబీడు, కురుకుంద తదితర గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, చిగిళి, బిణిగేరి, నగరూరు, కైరుప్పల, బిల్లేకల్, ములుగుందం, బనవనూరు, జొహరాపురం, కారుమంచి, చిన్నహోతూరు, ముత్తుకూరు, తంగరడోణ, తొగలుగల్లు గ్రామాల్లో శని, ఆదివారం రెండు రోజులు పాటు వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువైన వినాయకుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సోమవారం నిమజ్జనం చేయనున్నట్లు ఆయా గ్రామాల నిర్వాహకులు తెలిపారు.

మద్దికెర : సకాలంలో విస్తారంగా వర్షాలు కురిపించి సమృద్ధిగా పంటలు పండి అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని భక్తులు బొజ్జగణపయ్యను కోరుకున్నారు. వినాయకచవితి సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శనివారం వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, హంప తదితర గ్రామాల్లో వాడ వాడలా వినాయక విగ్రహాలను కొలువుంచారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు.

హాలహర్వి: మండలంలోని హాలహర్వి, గూళ్యం, నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, అర్ధగేరి తదితర గ్రామాల్లో శనివారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా మండపాల్లో వినాయక విగ్రహాలను నెలకొల్పారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గూళ్యం గ్రామంలోని గాదిలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం ప్రజలను ఆకట్టుకుంది. గాదిలింగేశ్వరస్వామి రూపంలో విగ్రహం ఏర్పాటు చేయడం ప్రజలను ఆకట్టుకుంది. ఆదివారం గణనాథులకు ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం మండలంలోని బాపురం కాలువ వద్ద నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వెల్దుర్తి: వినాయక చవితి పురస్కరించుకుని శనివారం మండలంలోని అన్ని గ్రామాలలో 127 విగ్రహాలు ఏర్పాటయ్యాయి. వీటితో పాటు మండల కేంద్రంలో 45 విగ్రహాలు ఏర్పాటు చేశారు. నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో శాస్త్రోక్తంగా విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. 9వ తేదీ పల్లెల్లోని విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఆయా గ్రామాల సమీప కుంటలు, చెరువుల్లో ఉండనుంది. మండల కేంద్రంలో మంగళవారం లద్దగిరి రోడ్డులోని హంద్రీనీవా కాలువలో నిమజ్జనం జరుగుతుందని ఎస్ఐ అశోక్ తెలిపారు. నిమజ్జన ప్రాంతాలను ఎస్ఐ పరిశీలించారు.

కృష్ణగిరి:వినయక చవితిని పురష్కరించుకుని గ్రామ గ్రామాన విగగ్రహాలు కొలువుదీర్చారు. ఎరుకలచెరువు గ్రామంలో విభిన్న ఆకారాల్లో ఏకదంతుడు దర్శనమిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామంలో వినాయకచవితి వేడుకలను శనివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే మండపాల్లో వినాయకుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం విగ్రహాల వద్ద భక్తులు పూజ కార్యక్రమాలు, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో యువకులు విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నిమజ్జన కార్యకమాలు నిర్వహిస్తున్న ఆయా గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని చెరువులు, కుంటలు, కాలువల్లో నిమజ్జనాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్ఐ మల్లికార్జున కోరారు.

హొళగుంద: మండల కేంద్రంతో పాటు పల్లెలో వాడవాడలో వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. భక్తులు మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమవారం ఎల్లెల్సీ, చెరువులు, బావుల్లో విగ్రహాల నిమజ్జన కార్యక్రమం జరగనుంది. మండలంలో మొత్తం 113 విగ్రహాలు ప్రతిష్ఠించగా.. 24 హొళగుందలో కొలువుదీరాయి.



పూజల్లో పాల్గొన్న రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ దంపతులు

పత్తికొండ (తుగ్గలి) : వినాయక ఉత్సవాలను పత్తికొండ, తుగ్గలి మండలాల్లో శని, ఆదివారాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లల్లో, మండపాలల్లో వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేకంగా అలంకరించారు. గణనాథుడికి ఇష్టమైన కుడుములు, పిండితో చేసిన పాయసం, ఇతర పిండి పదార్థాలు నైవేద్యంగా సమర్పించి పార్వతీ పుత్రుడికి ఘనంగా పూజలు చేశారు. భక్తి గీతాలతో మండపాలు సందడిగా మారాయి. పత్తికొండలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్. రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ దంపతులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ప్రజలు మండపాలకు వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గూళ్యం గాదిలింగేశ్వరస్వామి ఆకారంలో కొలువుదీరిన గణనాథుడు



పెరవలి బీసీ కాలనీలో పూజలందుకుంటున్న వినాయకుడు



ఆస్పరిలో కొలువైన గణనాథుడు



వెల్దుర్తి 1వ వార్డులో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



ఆలూరులో వినాయ భక్తమండలి సభ్యులు ఏర్పాటు చేసిన శ్రీ వేంకటేశ్వరస్వామి గణపతి



ఎరుకలచెరువులో కొలువుదీరిన పంచముఖి వినాయకుడు



హొళగుందలో కొలువుదీరిన వినాయకుడు



ఎరుకల చెరువులో కొలువుదీరిన లంబోదరుడు

టీడీపీది బురద రాజకీయం



ఎమ్మెల్యే విరూపాక్షిని కలిసిన ఆస్పరి మండల సర్పంచ్‌లు

ఆలూరు: కృష్ణా నది, బుడమేరు వాగుకు వరద పోటెత్తడంతో విజయవాడలోని పలు కాలనీలు నీట మునిగినా ప్రభుత్వం వేగంగా స్పందించకపోవడం, బాధితులను ఆదుకోవడంలో విఫలమైందని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి విమర్శించారు. చిప్పగిరిలో ఆస్పరి, చిప్పగిరి మండలాల సర్పంచ్‌లు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తమ పరిధిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బాధితులను ఆదుకోకపోగా.. చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నేతలు బురద రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టి సారించాలని సూచించారు. చిన్న హోతూరు,యాటకల్లు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు పెద్దరెడ్డి, కృష్ణ, నాయకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు



ఎస్.వి. మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఎస్‌వీ.మోహన్‌రెడ్డిని కర్నూలులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేయడానికి కలిసికట్టుగా కృషి చేస్తామని చెప్పారు. తెర్నెకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్, ఉప సర్పంచ్ బెల్ ఈరన్న, మాజీ కేడీసీసీ డైరెక్టర్ ఉమాంబ, ఎంపీటీసీ నామాల శ్రీనివాసులు, చాప ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలుతున్న మట్టిమిద్దెలు



వెల్దుర్తి 2వ వార్డులో కూలిన మట్టిమిద్దె,



లింగాలపల్లెలో కూలిన మట్టి మిద్దెను చూపుతున్న బాధితుడు నాగరాజు

వెల్దుర్తి: ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలో మట్టిమిద్దెలు కూలుతున్నాయి. శుక్రవారం రాత్రి మండలంలోని రామళ్లకోటలో మట్టిమిద్దె కూలి వంట చేస్తున్న జైనుబీకి తీవ్ర గాయాలయ్యాయి.అలాగే శనివారం, ఆదివారం సైతం మండలంలోని వెల్దుర్తి, లింగాల పల్లె గ్రామాల్లో మట్టిమిద్దెలు కూలాయి. స్థానిక 2వ వార్డులో సువర్ణమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఆమెతో పాటు ఉన్న భర్త నాగేశ్వరరెడ్డి, కుమారుడు నాగిరెడ్డి బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. వరండా, వంట గది సైతం కూలిపోయాయి. కోడిపిల్లలు మిద్దె కింద పడి చనిపోయాయి. దాదాపు రూ.లక్షన్నర ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. లింగాలపల్లెలో నాగరాజు, రాజుకు చెందిన మట్టిమిద్దెలు కూలిపోయాయి. ఆ సమయంలో కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నివాళి

పత్తికొండ(తుగ్గలి) : వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రహ్లాదరెడ్డి నాల్గవ వర్ధంతిని కుటుంబ సభ్యులు ఆదివారం తుగ్గలిలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు, ప్రహ్లాదరెడ్డి సతీమణి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హోసూరు రోడ్డులోని వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే.. మాజీ మంత్రి ఎస్‌వీ సుబ్బారెడ్డిని తమ్మారెడ్డి కుటుంబ సభ్యులు కలిశారు.

15న రాష్ట్రస్థాయి భజన పోటీలు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు గ్రామంలో మారెమ్మ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీన రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ. 20వేలు, రూ.15 వేలు, రూ.12వేలు, రూ.10 వేలు,రూ.8వేలు, రూ.6వేలు, రూ. 5వేలు అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ : 9989272156, 9014919781, 9398641704 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడు, మద్యం ప్యాకెట్లతో పోలీసులు

మంత్రాలయం: అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం బాటిళ్ల తరిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఆదివారం గ్రామాల్లో తనిఖీలు చేస్తుండగా చిలకలడోణ గ్రామానికి చెందిన వెంకటేష్, ఎమ్మిగనూరుకు చెందిన వెంకటేషల వద్ద నుంచి 240 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



బాపురం ఎల్‌ఎల్‌సీ కెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్ర

హాలహర్వి: మండలంలో గణనాథుడి విగ్రహాల నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఎస్ఐ చంద్ర తెలిపారు. ఆదివారం బాపురం ఎల్‌ఎల్‌సీ కాలువ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని బాపురం ఎల్‌ఎల్‌సీ కెనాల్, చింతకుంట ఎల్‌ఎల్‌సీ కెనాల్, గూళ్యం వేదావతి నది, బల్లూరు దగ్గర వేదావతి నదిలో గణనాథుల నిమజ్జనం చేసేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలు క్రమపద్ధతిలో వచ్చేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. పోలీసు సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్నారు.

గుంతలు పూడ్చివేత



హొళగుందలో గ్రావెల్ వేసి చదును చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలో గుంతలు పడి అధ్వానంగా మారిన ప్రధాన రోడ్డులో శనివారం గ్రామ సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు పంపాపతి గ్రావెల్ వేయించి బాగు చేయించారు. సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఉండటంతో విగ్రహాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని, స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గుంతలను గ్రావెల్‌తో పూడ్పించారు.



కమ్ముకున్న మేఘాలు

హొళగుంద: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం మేఘాలు కమ్ముకోవడంతో ఒక్కసారిగా చీకటిగా మారింది. చల్లటి గాలులు, నల్లటి మేఘాలతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో భారీ వర్షం కురిసే అవకాశముందని రైతులు ఆందోళన చెందారు. అయితే కొంత సేపటికి తేలికపాటి జల్లులు కురిసి మేఘాలు ముందుకు వెళ్లిపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.